ఆరోగ్య కేంద్రాలపై నమ్మకం కలిగించాలి



ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహిస్తున్న ఎంపీపీ కోటేరు లక్ష్మి

వీరులపాడు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ప్రజలకు నమ్మకం కలిగించేలా వైద్యాధికారులు, వైద్యారోగ్య సిబ్బంది సేవలందించాలని ఎంపీపీ కోటేరు లక్ష్మి అన్నారు. మండలంలోని అల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుఖ ప్రసవాలు జరిగేలా వైద్యాధికారులు కృషి చేయాలన్నారు. ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గర్భిణిలు, బాలింతలను గుర్తించి ఎప్పటికప్పుడు వైద్య సేవలు పొందేలా సిబ్బంది వారికి అవగాహన కలిగించాలని తెలిపారు. పౌష్టికాహారం తీసుకునేలా చూడాలని సూచించారు. వైద్యారోగ్య కేంద్రాలకు వచ్చే రోగులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని తెలిపారు. ముఖ్యంగా కుక్క, పాము కాటు మందులను అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొని తల్లిపాల విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివపార్వతి, సర్పంచ్‌లు బందెల రాణి, షోడగిరి రాజశ్రీ, ఎంపీటీసీ సభ్యురాలు మోండ్రు బాయమ్మ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

ముర్రుపాలలో రోగ నిరోధక శక్తి

కె.అగ్రహారం గ్రామంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ



గర్భిణులు, బాలింతలు, తల్లులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కె.అగ్రహారం(జగ్గయ్యపేట అర్బన్): పేట మండలంలోని కె.అగ్రహారం గ్రామంలో గురువారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ ఏసీడీపీవో కె.నాగమణి, సూపర్‌వైజర్ కె.స్వర్ణ, ఏఎన్ఎం వరలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ వర్కర్లు ర్యాలీలో పాల్గొని తల్లిపాల విశిష్టతను గురించి తల్లులు, బాలింతలకు అవగాహన కల్పించారు. తల్లి పాలు బిడ్డకు ఎంతో ముఖ్యమైన ఆహారం అని వివరించారు. పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలని తల్లులకు విజ్ఞప్తి చేశారు. ముర్రుపాలలో అతి ముఖ్యమైన పోషక విలువలతో పాటు రోగ నిరోధక శక్తి పుష్కలంగా ఉంటుందని, భవిష్యత్తులో బిడ్డకు అనారోగ్య సమస్యలు రావని తెలిపారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది, అంగన్ వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ

మాజీ ప్రభుత్వ విప్ ఉదయభాను



కృష్ణ కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల వైఎస్సార్ బీమా చెక్కును అందజేస్తున్న ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: కార్యకర్తలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను అన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో జగ్గయ్యపేట పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వత్సవాయి మండలం లింగాల గ్రామ సచివాలయ కన్వీనర్ అంబోజి వెంకటకృష్ణ మృతి చెందాడు. సచివాలయ కన్వీనర్లకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీమా సదుపాయం కల్పించడంతో మృతుడు అంబోజి వెంకటకృష్ణ కుటుంబానికి రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మంజూరైన రూ.5 లక్షల బీమా చెక్కును గురువారం పట్టణంలోని తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఉదయభాను మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్ల పక్కన చెత్త పడేస్తే చర్యలు



వాగు బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ హేమమాలిని

నందిగామటౌన్: ప్రతి ఒక్కరూ విధిగా పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ హేమమాలిని అన్నారు. పట్టణంలోని పల్లగిరి సమీపంలోని వాగు బ్రిడ్జి ప్రాంతాన్ని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ముఖ్యంగా చెత్తాచెదారాన్ని రోడ్ల పక్కన వేయకూడదని సూచించారు. వాగు బ్రిడ్జి ప్రాంతంలో కొందరు చెత్త పడేస్తున్నారని ఫిర్యాదులు రావటంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించి చెత్తను తొలగించామన్నారు. రోడ్ల పక్కన చెత్త పడేస్తే చర్యలు తీసుకుంటామని రోడ్ల పక్కన చెత్త వేయకుండా సచివాలయ సిబ్బంది పర్యవేక్షించాలని సూచించారు. చెత్త తొలగించిన ప్రాంతంలో దుర్గంధం వెదజల్లకుండా బ్లీచింగ్ చల్లించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఈ ఫణిశ్రీనివాస్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల అభివృద్ధి ఎన్డీఏతోనే సాధ్యం

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రఫుల్ల శ్రీకాంత్



పేట బస్టాండ్ సెంటర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సంబంధించి ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం రిజర్వేషన్ కోటాను ఉప వర్గీకరించేందుకు రాష్ట్రాలకు అధికారం ఉందని సుప్రీం కోర్టు తేల్చి చెప్పడం హర్షణీయమని బీజేపీ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నెపాగ ప్రఫుల్ల శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మన్నె శ్రీనివాస్‌తో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు వలన ఎస్సీ, ఎస్టీలలో అన్ని ఉప కులాలకు సముచిత న్యాయం జరుగుతుందన్నారు. ఇక అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ఉప వర్గీకరణ ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సంబరాలు

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సుప్రీం కోర్టు ఆమోదం తెలపడంతో జగ్గయ్యపేట పట్టణంతో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, పలు సంఘాల ప్రతినిధులు సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ ఎదురుగా ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి, అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహాల వద్ద కేక్ కట్ చేసి పలువురికి పంచారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు మాతంగి దావీదు మాదిగ, వత్సవాయి మండల ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ కన్వీనర్ మాగి శ్రీనివాసరావు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మార్కపూడి చైతన్య, అన్నెపాగ దుర్గారావు, ఆనంద్, కాంతారావు, కోట ప్రభుజీరావు, మాజీ కౌన్సిలర్ కటికల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం దృష్టికి ఇనాం భూముల సమస్య

జగ్గయ్యపేట అర్బన్: ఇనాం భూముల సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సీఎం చంద్రబాబును కోరారు. ఈ మేరకు ఆయన గురువారం సీఎంను సచివాలయంలో కలసి వినతిపత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 1100 ఎకరాలు ఇనాం భూముల పరిధిలో ఉన్నాయని, నిషేధిత జాబితాలో ఉన్నాయని, దీని వలన భూముల క్రయ విక్రయాలు నిలిచిపోవడంతో భూ యజమానులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలియజేశానన్నారు. గత 70 ఏళ్లుగా వారు ఆ భూములను అనుభవిస్తున్నారని, నిషేధిత భూముల జాబితా నుంచి సదరు భూములను తొలగించి వారిని విముక్తులను చేయాలని కోరినట్లు తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఊర చెరువు పరిశీలన

పట్టణంలో పర్యాటక కేంద్రంగా రూపొందుతున్న ఊర చెరువులో జరుగుతున్న బ్యూటిఫికేషన్ పనులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) గురువారం మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులతో కలసి పరిశీలించారు. పెద్ద రామాలయం పునర్నిర్మాణ పనులను పరిశీలించారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

నందిగామ టౌన్: పట్టణ ప్రజలు తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని మున్సిపల్ కమిషనర్ హేమమాలిని అన్నారు. పట్టణ సమీపంలోని మున్నేటిలో ఉన్న తాగునీటి బోర్లను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ నుంచి వరద వస్తుండటంతో మున్నేటిలో తాగునీటిని సరఫరా చేసే బోర్లు మునిగాయని, వరద ఉధృతి పెరిగితే ఈ పథకం నుంచి తాగునీటిని సరఫరా చేయటం నిలుపుదల చేస్తామని తెలిపారు. కీసర, రామన్నపేట నుంచి తాగునీటి సరఫరా యథావిధిగా కొనసాగుతుందని చెప్పారు. అత్యవసరమైతే ట్యాంకర్‌ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం పట్టణంలోని రైతుబజార్ ఆవరణలోని అన్నా క్యాంటీన్‌ను ఆమె పరిశీలించారు. 98 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15 నాటికి పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ఫణి శ్రీనివాస్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



నందిగామ పట్టణంలో పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే సౌమ్య, అధికారులు



పెనుగంచిప్రోలులో పింఛన్ల పంపిణీలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

నందిగామ టౌన్: పింఛన్ లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఇంటి వద్దనే పింఛన్ అందిస్తున్నట్టు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు. పట్టణంలోని అన్ని సచివాలయాల పరిధిలోని పింఛన్ లబ్ధిదారులకు గురువారం పింఛన్ నగదును అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడు, తొమ్మిది, 20 వార్డులలో పర్యటించి ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందించామన్నారు. గత ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెలా మొదటి తేదీన లబ్ధిదారుల ఇళ్ల వద్దనే పింఛన్ నగదును అందిస్తున్నట్లు తెలిపారు. పింఛన్‌ల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే సహించేది లేదన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రవీంద్రరావు, మున్సిపల్ కమిషనర్ హేమమాలిని, ఏఈ ఫణి శ్రీనివాస్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

92 శాతం పింఛన్ల పంపిణీ

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం పింఛన్ల పంపిణీ 92 శాతం పూర్తయిందని ఎంపీడీఓ రమేష్‌బాబు తెలిపారు. మొత్తం 10,330 మంది పెన్షన్‌దారులకు ఆయా గ్రామాల్లోని సచివాలయ సిబ్బందితో పాటు అధికార పార్టీ నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. షేర్‌మహ్మద్‌పేటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో...

మండలంలో గురువారం సాయంత్రానికి 92.24 శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ హర్షసాయి తెలిపారు. గ్రామాల్లో నాయకులతో పాటు పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. పెనుగంచిప్రోలులో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ పింఛన్ల పంపిణీలో పాల్గొన్నారు.

వత్సవాయిలో 96 శాతం పంపిణీ

మండలంలో గురువారం సాయంత్రానికి 96 శాతం పెన్షన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ భరత్ రాజ్ తెలిపారు. గ్రామాల్లో నాయకులు, అధికారులు కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

కంచికచర్ల: మండలంలోని పేరకలపాడు, కంచికచర్ల గ్రామాల్లో గురువారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా ప్రభుత్వం పెన్షన్లు అందజేయడం ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు మనోధైర్యం కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

96 శాతం పింఛన్లు పంపిణీ

పొన్నవరం(వీరులపాడు): ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి చంద్రబాబు పెంచిన పింఛన్‌లను ఇంటి వద్దనే లబ్ధిదారులకు అందిస్తున్నారని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. మండలంలోని పొన్నవరం గ్రామంలో గురువారం సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్ అందిస్తామన్నారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో 96 శాతం పింఛన్‌లను పంపిణీ చేసినట్లు ఎంపీడీవో శివపార్వతి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొండ్రగుంట శ్రీనివాస్‌కుమార్, కడియాల చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని శాంతినగర్‌లో అర్హులైన పెన్షన్‌దారులు అందరికీ గురువారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) స్థానిక నాయకులు, అధికారులతో కలసి పెన్షన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర



అన్నా క్యాంటీన్ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిలర్లు

జగ్గయ్యపేట అర్బన్: అన్నా క్యాంటీన్ పనులను త్వరగా పూర్తిచేయాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర కోరారు. ఆయన గురువారం అన్నా క్యాంటీన్ ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన అన్నా క్యాంటీన్‌లు ఈ నెల 15న ప్రారంభించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, గొట్టె నాగరాజు, సంగెపు బుజ్జిబాబు, ఇల్రి నరసింహారావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తే సహించం

పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లో టిడ్కో గృహాలకు వెళ్లే దారిలో స్థల వివాదం సృష్టించి, ఆ స్థలం తనదని ఒక అజ్ఞాత వ్యక్తి రోడ్డుకు అడ్డంగా గుంటను తవ్వి అధికారులను ఇబ్బంది పెడుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. వివాదం ఏమైనా ఉంటే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచించారు. ఇష్టారాజ్యంగా ఇలా గుంటను తవ్వి ప్రజలకు ఉపయోగపడే పనులకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ శివకోటేశ్వరరావు, టౌన్ సర్వేయర్ విశ్వనాథం, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ ప్రారంభం

పట్టణంలోని స్థానిక ఎస్‌జీఎస్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌ను మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర గురువారం రాత్రి ప్రారంభించారు.